www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 నవంబరు 2022

5

పశ్చిమ గోదావరి



ప్రజా సంక్షేమమే లక్ష్యం

డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మంగళవారం అర్తమూరులో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన ప్రతి సచివాలయానికీ ముఖ్యమంత్రి రూ.20 లక్షలు కేటాయించారని. దీంతో గ్రామంలోని నాయకులందరూ ఏకతాటిపైకొచ్చి ఆ నిధులతో గ్రామంలో సీసీ డ్రెయిన్లు నిర్మించాలని తన దృష్టికి తీసుకొచ్చారని, దానిలో భాగంగానే పనులకు భూమి పూజ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోనబోయిన వీర్రాజు, ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు పాల్గొన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని, లోపాలుంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం 3.42 లక్షల మెట్రిక్ టన్నులవ్వగా ఇప్పటి వరకూ 10,800 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. జిల్లాలోని 296 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. తొలుత తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు మండలాల్లో ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. మిగిలిన మండలాల్లో అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే నగదు జమ చేయడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతులు ధాన్యం మిల్లులకు తరలించే సందర్భంలో ఆసరాగా వాలంటీర్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆర్‌బికెలో ఒక సీనియర్ విఆర్ఒ, అర్ఐలను కస్టోడియన్లుగా నియమించామన్నారు. మిల్లులకు ధాన్యం రవాణాకు ఇప్పటికే 290 లారీలను సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. ధాన్యం రవాణాను ప్రభుత్వం చేపడితే ఏజెన్సీకి రవాణా ఖర్చులు చెల్లిస్తామని, రైతు స్వయంగా రవాణా, గోనె సంచులు, హమాలీలను ఏర్పాటు చేసుకుంటే ధాన్యం కొనుగోలు సొమ్ముతోపాటు సదరు ఖర్చులను కూడా రైతు ఖాతాలో నేరుగా జమ చేస్తామని చెప్పారు. గోనె సంచులకు ఇబ్బంది లేదని, ఇప్పటికే ఆర్‌బికెల్లో అవసరమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచామని తెలిపారు. జిల్లాలోని 55 వే బ్రిడ్జిల్లో వాలంటీర్లను నియమించి 24 గంటలు గడవక ముందే వేబ్రిడ్జిలో తూకమైన ధాన్యం వివరాలను తెప్పించుకుని సరిచూస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన ఆర్‌బికెల్లో డిప్యూటీ తహశీల్దార్‌స్థాయి అధికారులను 34 మందిని నియమించామని, మిగిలిన మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు చేపట్టినప్పుడు వీరి అనుభవం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మిల్లు, ఆర్‌బికెల్లో

లోపాలుంటే మా దృష్టికి తీసుకురండి

కలెక్టర్ పి.ప్రశాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తేమ శాతం వ్యత్యాసం ఉంటుందని, వీటిలో దేనిని పరిగణనలోకి తీసుకుంటారని ఒక విలేకరి ప్రశ్నించగా ఆర్‌బికెల్లో నిర్ణయించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటామని కలెక్టర్ సమాధానమిచ్చారు. తేమశాతంలో వ్యత్యాసంపై అభ్యంతరం ఉంటే పరిష్కారం చూపేందుకు ఒక అధికారిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వంద కిలోల బస్తా గ్రేడ్-ఎ రకానికి రూ.2,060, కామన్ వెరైటీకి రూ.2,040, 75 కేజీలకు గ్రేడ్-ఎ రసానికి రూ.1,545, కామన్ వెరైటీకి రూ.1530 మద్దతు ధరగా చెల్లిస్తున్నట్లు వివరించారు.

18న సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

నరసాపురంలో ఈ నెల 18న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. రూ.రెండు వేల కోట్లు విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆక్వా యూనివర్సిటీ, ఫిషింగ్ హార్బర్, వాటర్ గ్రిడ్, ఇరిగేషన్ బండ్ బలపరచడం, అక్విడెక్టు, స్లూయిస్‌ల మరమ్మతులు, శేషావతారం ఛానల్ విస్తరణ, నాలుగు రెగ్యులేటర్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన, అలాగే నాడు-నేడు కింద చేపట్టిన హాస్పిటల్, ఆర్‌టిసి బస్టాండ్లకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

భీమవరం పట్టణంలో ఆక్రమణల నిరోధానికి చర్యలు

భీమవరం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ఇప్పటికే నోటీసులను జారీ చేసినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఆక్రమణదారులు పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగింపునకు సహకరించాలని కోరారు.

పరివర్తన 0.2 అమలు

జిల్లాలో నాటుసారాను అరికట్టేందుకు సారా తయారీదారులతో మాట్లాడి వారి ప్రత్యామ్నాయ ఉపాధికి డిఆర్‌డిఎ ద్వారా 108 మందికి రుణాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఉపాధి పొందేందుకు మరింత మంది గ్రూపుగా వస్తే ముద్ర రుణాలను కూడా మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జెవి.మురళీ, నరసాపురం సబ్ కలెక్టర్ ఎన్.సూర్యతేజ, భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : ముఖ్యమంత్రి ఈనెల 21న నరసాపురం పర్యటనలో ఎటువంటి లోపాలను తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేసి, సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టరు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన నరసాపురం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలన్నారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పూర్తి చేపట్టాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు డి.అఖిల, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

రాలిన.. ధృవతార

నటశేఖర కృష్ణకు జిల్లాతో విడదీయరాని అనుబంధం

విద్యార్థిగా, సినీ నటునిగా, రాజకీయ నేతగా సుదీర్ఘ ప్రయాణం

శోకసంద్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి వాసులు

ఉదయం ఆట రద్దు చేసి నివాళులర్పించిన డిస్ట్రిబ్యూటర్లు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఒక తార నేలను వీడింది. జిల్లాతో విడదీయరాని బంధాన్ని పెనవేసుకున్న ఆ ధ్రువతార సెలవు తీసుకుంది.. సాహసం శ్వాసగా.. మొండితనం తనపేరుగా.. వైవిధ్యం, కొత్తదనం నిత్యం కోరుకునే ఆ తార కనుమరుగైంది. ఆప్యాయత, అనురాగాలతో చిన్నవారినైనా, పెద్దవారినైనా పలుకరించే ఆ సూపర్‌స్టార్ కన్నుమూత జిల్లావాసులను దుఃఖసాగరంలో ముంచింది.

సినీ వినీలాకాశంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న సూపర్‌స్టార్ కృష్ణకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన విద్యాభ్యాసం, రాజకీయ ప్రవేశం ఇక్కడే కొనసాగగా, సినిమా రంగంలోనూ జిల్లాతో బంధాన్ని పెనవేసుకున్నారు. 1942 మే 31న గుంటూరు జిల్లా తెనాలి పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని వీరరాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా కృష్ణ జన్మించారు. ఆయనిది రైతు కుటుంబం. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివరామకృష్ణమూర్తి సినిమాల్లోకి వచ్చినప్పుడు ఆదుర్తి సుబ్బారావు ఈ పేరును కృష్ణగా కుదించారు. చిన్నతనం నుంచి ఆయనకు ఎన్.టి.రామారావు అభిమాన నటుడు, పాతాళ భైరవి అభిమాన చిత్రం. కృష్ణను ఇంజనీరును చేయాలనే కోరిక తల్లిదండ్రులకు ఉండేది. అందుకోసం ఇంటర్మీడియట్‌లో ఎంపిసి సీటు కోసం ప్రయత్నించగా గుంటూరు కళాశాలలో దొరకకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఎంపిసి గ్రూపుతో ఇంటర్‌లో చేరారు. అక్కడ మూడు నెలలే చదివి ఏలూరులోని సిఆర్.రెడ్డి కళాశాలకు మారారు. అక్కడే ఇంటర్ పూర్తి చేసి తర్వాత బిఎస్‌సి కూడా చదివాడు. సిఆర్.రెడ్డి కళాశాలలో కృష్ణ, సినీ నటుడు మురళీమోహన్ క్లాస్‌మేట్లు. ఇద్దరూ మంచి స్నేహితులు. కృష్ణ



ఏలూరులో డిగ్రీ చదువుతుండగా ఏలూరులో ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఆ కార్యక్రమానికి కృష్ణ హాజరయ్యారు. నాగేశ్వరరావు ఆ స్థాయిలో ప్రజాభిమానం పొందగలడం చూసి ఆయన నటుడు కావడం వల్లే ఇంతటి గుర్తింపు వస్తుందని అర్థం చేసుకుని సినీ నటుడు కావాలనే అభిలాషను పెంపొందించుకున్నాడు. ఆయన డిగ్రీ పూర్తి చేశాక ఇంజినీరింగ్ కోసం ప్రయత్నించాడు. అయితే కృష్ణకు సీటు రాలేదు. దీంతో కృష్ణ విద్యార్థి జీవితానికి స్వస్తి పలికి మద్రాసు చేరుకున్నాడు. అక్కడ సినీరంగంలో ప్రవేశించాడు.

ఏలూరు నుంచే రాజకీయ రంగ ప్రవేశం

1989లో కృష్ణ కాంగ్రెస్ తరపున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే 1991 ఎన్నికల్లో కృష్ణ గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం కోరుకున్నా తిరిగి ఏలూరులోనే పార్టీ పోటీ చేయించింది. ఆ ఎన్నికల్లో 31 వేల ఓట్ల తేడాతో ప్రత్యర్థి బోళ్ల బులిరామయ్య చేతిలో కృష్ణ ఓటమి పాలయ్యారు. 1991లో తనకు సన్నిహితుడు, రాజకీయాల్లో తనను ప్రోత్సహించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దారుణ హత్యకు గురికావడం, తాను కోరిన గుంటూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోవడం, ఏలూరులో ఓటమి చెందడం వంటి కారణాలతో కృష్ణ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు. 2009 ఎన్నికల్లో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. ఏలూరు మినీబైపాస్ రోడ్డు మంజూరు విషయంలో ఎంపీగా కృష్ణ చూపిన చొరవ మరువలేనిది. సినీనటుడు కృష్ణ మృతికి సంతాప సూచకంగా మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉదయం ఆటను రద్దు చేశారు.

సిపిఎస్ రద్దు కోరుతూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎస్ రద్దు కోరుతూ జరిగే దశలవారీ పోరాటాల్లో భాగంగా మంగళవారం అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో క్లాత్ బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్లకు మాత్రమే లాభాలు చేకూర్చే సిపిఎస్ విధానం, దానికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన జిపిఎస్ విధానం ఉదోగ, ఉపాధ్యాయులకు ఏ మాత్రమూ లాభదాయకం కాదన్నారు. ఉద్యోగుల పొట్టకొట్టే ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చి ఎన్నికై మూడేళ్లయినా అమలు కాలేదని, అడిగితే కేసులు పెడుతున్నారని విమర్శించారు ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం రాష్ట్ర కమిటీ దశలవారీ పోరాటాలకు పిలుపు ఇచ్చిందని, ఇప్పటికే సిపిఎస్ ఇంటికీ యుటిఎఫ్ పేరుతో ప్రతి సిపిఎస్ ఉద్యోగినీ చైతన్య పరుస్తూ డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేస్తున్నట్లు తెలిపారు. అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో క్లాత్ బ్యానర్‌పై ఉద్యోగ ఉపాధ్యాయులు సంతకాలు చేయడం జరుగుతోందన్నారు. సిపిఎస్ జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ కెఎస్.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ఈ నెల 27న భీమవరంలో జిల్లాస్థాయిలో టెన్ కె వాక్ ఉంటుందని, ఈ కార్యక్రమానికి సిపిఎస్ ఉదోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పాలకోడేరు మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రమణరాజు, కె.త్రిమూర్తులు, మల్లుల శ్రీనివాస్, జి.సుధాకర్ పాల్గొన్నారు.



క్లాత్ బ్యానర్‌పై సంతకం చేస్తున్న గోపీ మూర్తి

కాళ్ల : సిపిఎస్ రద్దు చేసే వరకూ యుటిఎఫ్ పోరాటం ఆగదని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య తెలిపారు. కోపల్లె హైస్కూల్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టాభి రామయ్య మాట్లాడుతూ దశలవారీ పోరాటంలో భాగంగా బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు బిఆర్ఎంకె.స్వామి, ప్రధాన కార్యదర్శి జి.రామ కృష్ణంరాజు, గౌరవాధ్యక్షులు ఎం.రాజేంద్రబాబు, కార్యదర్శులు ఎం.శంకర్రావు, బి.కిషోర్, కె.రవిచంద్ర కుమార్, జి.కిషోర్ కుమార్, ఎం.సత్యంబాబు, వర్మ పాల్గొన్నారు.

అత్తిలి : యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అత్తిలి బస్టాండ్ సెంటర్లో సిపిఎస్ రద్దు కోరుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసే వరకూ పోరాడతామని తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాద యాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎస్ మండల కన్వీనర్ రామారావు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరుగడ్డ పాలకొల్లు

నేటి నుంచి సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్మిక, కర్షకుల పోరాటాల గడ్డ పాలకొల్లులో ఈ నెల 16, 17 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ జరగనుంది. పూలపల్లి సెంటర్‌లో డాక్టర్ అంబేద్కర్ భవనంలో రెండు రోజులపాటు జరగనున్న ఈ మహాసభకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ 1991లో పాలకొల్లులో జరిగింది. 31 సంవత్సరాల అనంతరం తిరిగి పాలకొల్లు ఈ మహాసభకు వేదికైంది. ఈ మహాసభకు ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ.గఫూర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ హాజరు కానున్నారు. మహాసభ ఏర్పాట్లను జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పర్యవేక్షించారు.

ఆకర్షణీయంగా ప్రధాన ద్వారం

ప్రధాన ద్వారానికి జిల్లాలో కార్మిక, కర్షక, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన కీర్తిశేషులు అల్లూరి సత్యనారాయణ, మహ్మద్ మీరా, పోతురాజు కృష్ణారావు, చవ్వాకుల సత్యం పేరిట తీర్చిదిద్దారు. మహాసభ ప్రాంగణాన్ని శ్రామిక మహిళా నేత, సిఐటియు రాష్ట్ర కమిటీలో బాధ్యతలు నిర్వర్తించిన మారుబోయిన సావిత్రమ్మ నగర్ పేరిట నామకరణం చేశారు.

ఉద్యమాల గడ్డ పాలకొల్లు

పాలకొల్లులో గతంలో వ్యవసాయ, రైస్‌మిల్, కొబ్బరి కార్మికుల హక్కుల కోసం అనేక ఉద్యమాలు సాగాయి. పాలకొల్లులో సహకార రంగంలో సుగర్ ఫ్యాక్టరీ వచ్చేందుకు సిఐటియు కృషి ఎనలేనిది. నరసాపురం ఎంపీగా ఉద్దరాజు రామం ఉండగా 1966లో పూలపల్లిలో చక్కెర పరిశ్రమ ఏర్పాటు చేశారు. నష్టాల పేరుతో ప్రభుత్వం 1992లో మూసివేయగా కార్మికులు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల కోసం ఉధృతంగా పోరాటం చేశారు. భగ్గేశ్వరంలో 1987లో



సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన అమరవీరుల ద్వారం

గణపతి రైస్‌మిల్లులో యాజమాన్యం, కార్మికుల మధ్య వివాదం చోటుచేసుకున్న ఘటనలో కార్మికులు నికరంగా పోరాడారు. 2005లో నర్సాపురం రోడ్డులో విజయలక్ష్మి రైస్‌మిల్లులో 35 రోజులు కార్మికులు సాగించిన పోరాటంలో సిఐటియు పాత్ర ఎనలేనిది. ఇటీవల అడవిపాలెం గోడౌన్ లో యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా కార్మికులు సాగించిన సమరశీల పోరాటానికి సిఐటియు నేతృత్వం వహించింది.

పలు సమస్యలపై చర్చ

రెండు రోజుల పాటు జరిగే మహాసభలో కార్మికులు, ఉద్యోగులు జిల్లాలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించనున్నారు. మొత్తం 280 మంది వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు సభలో పాల్గొనున్నారు. ఇటీవల ప్రభుత్వ రంగాలను ప్రయివేట్ పరం చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సభలో చర్చించి తీర్మానాలు చేయనున్నారు. అంగన్వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఐకెపి ఉద్యోగులు, విఎఎలు, విఆర్ఎలు, వైద్య ఆరోగ్య శాఖ, 104, 108, విద్యుత్, ఆర్‌టిసి సిబ్బంది, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మహాసభలో విస్తృతంగా చర్చించనున్నామని రాయ్ తెలిపారు.

నేటి నుంచి భీమవరంలో కెవిపిఎస్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి - భీమవరం

సామాజిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న కెవిపిఎస్ ఐదో జిల్లా మహాసభ భీమవరం పట్టణంలో బుధ, గురువారాల్లో జరగనున్నాయి. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు తెలిపారు. మంగళవారం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల విజయకుమార్ అధ్యక్షతన స్థానిక సంఘ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రాంతిబాబు మాట్లాడుతూ ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన లక్ష్యాలతో 1998లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆవిర్భవించిందన్నారు. కులవివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించిందని తెలిపారు. క్షేత్రస్థాయి సర్వే చేసి 394 కులవివక్ష రూపాలను గుర్తించి వాటి నిర్మూలన కోసం జస్టిస్ పున్నయ్య కమిషన్, రాష్ట్రంలో ప్రస్తుతం కీలకంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఏర్పాటు చేయించడంలో కెవిపిఎస్ కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. దళిత పేటల అభివృద్ధికి ప్రత్యేక సబ్‌ప్లాన్ నిధులను కేటాయించాలని, అనేక ఉద్యమాలు సాగించి విజయం సాధించిందన్నారు. దళితపేటలకు సరైన శ్మశాన వాటికలు లేవని సాగించిన పోరాటాల ఫలితంగా అప్పటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి దళితపేటకు రెండెకరాల శ్మశాన వాటికను కేటాయించాలనే జిఒ నెం.1235ను సాధించిందని, ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి, రిజర్వేషన్ల పరిరక్షణకు, ఉద్యోగోన్నతుల్లోరిజర్వేషన్ల కల్పనకు నిరంతరం పోరాడుతుందన్నారు. దళితులపై జరిగే వివక్ష దాడులను, హత్యలు, కులాంతర వివాహాలు చేసుకున్న జంటలపై పరువు హత్యలపై సామాజిక శక్తులన్నింటినీ ఐక్యం చేసి ఉద్యమిస్తోందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఇవ్వకుండా దళిత పేటల అభివృద్ధికి పాలకులు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మతం పేరుతో దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు అందకుండా, దళితులు, క్రైస్తవ, మైనార్టీలపై దాడులు చేస్తూ, దేశ వ్యాప్తంగా బిజెపి అమలుచేసే విధానాలను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రు మాల్యాద్రి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో నేతలు కుమార్ బాబు, బాలస్వామి, ఆనంద్ బాబు, ప్రసాద్, సత్యనారాయణ మరియు పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో దళితులు రాణించాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుతం దళితులు వాణిజ్య రంగంలో రాణించేందుకు ఏదోక వ్యాపారాన్ని చేయాలని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సీసలిలో లక్ష్మీ సూపర్ మార్కెట్‌ను మోషేన్‌రాజు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ కోన జోసఫ్ వ్యాపార దృక్పథం చూసి మిగిలిన దళితులు వ్యాపార రంగంలో రాణించాలన్నారు. ఆక్వా ఆధారిత ప్రాంతంలో అనేక పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు అందుబాటులో నిత్యావసర సరుకులుండేలా సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ కేవలం లాభాపేక్షతో కాకుండా నాణ్యమైన అత్యవసర సరుకులు అందుబాటులో ఉండేలా సూపర్ మార్కెట్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు, టిటిడి మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహంరాజు, మేడిది జాన్సన్, గణేశ్న రాంబాబు, ఉప సర్పంచి బాతు మాణిక్యాలరావు, మాజీ సర్పంచి గంటా ఆనందరావు, ఆకివీడు సిఐ రామకృష్ణ, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి, దళిత నేతలు తాళ్లూరి మధు, బిరుదుగడ్డ రమేష్, పాము రవికుమార్, సిరింగి బాల పాల్గొన్నారు. అనంతరం సీసలిలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఒకటో వార్డులో రోడ్డు దుస్థితిని ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ దృష్టికి సీసలి ఉప సర్పంచి బాతు మాణిక్యాలరావు, గణేశ్న రాంబాబు తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు



సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు

టైలర్ల పాత్ర ఎనలేనిది : ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - తణుకురూరల్

మనిషి అందానికి, హుందాతనానికి తగట్టుగా పలు డిజైన్లలో దుస్తులు తయారు చేయడంలో టైలర్స్ పాత్ర ఎనలేనిదని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కొనియాడారు. మంగళవారం వేల్పూరులోని స్థానిక సాలిపేటలో టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ రూపకర్త ఇలియాస్ హావ్ విగ్రహాన్ని షేక్ సాబ్జీ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభ టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఇలియాస్ హావ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయనను స్మరించుకునే గొప్ప గౌరవాన్ని ఇచ్చారని అభినందించారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్లు తయారుచేసిన రెడీమేడ్ దుస్తులు మార్కెట్లో తక్కువ ధరలకు లభించడం వల్ల టైలర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఉపాధి కోల్పోతున్న టైలర్లను ఆదుకోవడానికి ప్రభుత్వమే గార్మెంట్స్ ఏర్పాటు చేసి రెడిమేడ్ దుస్తులు తయారు చేసే విధంగా ఉపాధి కల్పించాలన్నారు. వైసిపి నాయకులు పోలేపల్లి వెంకటప్రసాద్ (పివిఆర్) మాట్లాడుతూ సమాజంలో మనం గౌరవంగా ఉండాలంటే చక్కటి వస్త్రధారణ అవసరమన్నారు. ఈ వస్త్ర ధారణకి మూలకారణం దర్జీలని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడుతూ గతంలో దర్జీ అంటే దర్జాగా ఉండేవారని, అటువంటి దర్జీలు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం శిల్పి అందే మల్లేష్, విగ్రహం దాత కోటి చుక్కల నాగేంద్రకుమార్, కుట్టు మిషన్ సీనియర్ మెకానిక్ గుత్తికొండ వెంకట్రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి, ఎంపిపి రుద్ర ధనరాజు, వైస్ ఎంపిపి అయిశెట్టి శేషకుమారి, మల్లేశ్వరపు నాగరాజు, వాసా వెంకటేశ్వరరావు, టి.కోటవెంకటేశ్వరరావు, కె.వీరభద్రరావు, కె.మల్లికార్జునరావు, కోటి చుక్కల నాగేంద్రకుమార్, రేవాడి ఆంజి, కరెళ్ల రాంబాబు, రుద్రాక్షుల శ్రీనువాస్, శ్రీరాములు, ఆనందం గణేష్ పాల్గొన్నారు.



ఇలియాస్ హావ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న షేక్ సాబ్జీ

గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావాలి

ప్రజాశక్తి - ఆచంట

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణరాజు కోరారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభ నేపథ్యంలో మంగళవారం వల్లూరు సెంటర్లో ఆ సంఘం పతాకాన్ని సూర్యనారాయణరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు చట్టాల పేరుతో బడా కంపెనీలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే ప్రయత్నాలకు నిరసనగా ఒక సంవత్సరం పాటు ఢిల్లీలో రైతులు పోరాడితే గిట్టుబాటు ధర చట్టం చేస్తామని మాటిచ్చి చివరికి మోడీ ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యుత్ సవరణ చట్టం ప్రతిపాదనలను తక్షణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పంపుసెట్లకు మీటర్ల బిగింపు తక్షణం నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పంది సత్యనారాయణ, సాకా సూర్యారావు, చిట్టూరి సత్యనారాయణ, బోళ్ల సుబ్బారావు, కోసూరి సూర్యనారాయణరాజు, ఎ.పెద్దిరాజు, బొర్రా ధర్మారావు, జోగి సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతుసంఘం నేతలు నిరసన తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభ నేపథ్యంలో మంగళవారం వీరవాసరంలో పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాలం విజయకుమార్ మాట్లాడగా నాయకులు రెడ్డి రామారావు, నేపాల సీతన్న పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం మండల కార్యదర్శి ఇందుకూరి సూర్యనారాయణ రాజు

అత్తిలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - అత్తిలి

రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాలు భరణిప్రసాద్ అన్నారు. మంగళవారం అత్తిలి సచివాలయం - 3 రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి రాజేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ధాన్యం కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరణి ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యాన్ని అమ్మిన 21 రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఎఒ రాజేష్ మాట్లాడుతూ రైతు అమ్మిన ధాన్యాన్ని ఎనిమిది కిలోమీటర్ల వరకూ 50 కేజీలకు రూ.320 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. అలాగే అదనంగా కిలోమీటరుకు రూ.10 చొప్పన చెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి సర్పంచి గంట విజేత, జెడ్‌పిటిసి అడ్డాల జానకి, జెడ్‌పిటిసి కో ఆప్షన్ అభివద్దీన్ పాల్గొన్నారు.

గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ధాన్యం కొనుగోలు చేసేందుకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని జిల్లా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి బి.వీరాస్వామికి అగ్రికల్చర్ అసిస్టెంట్లు విన్నవించుకున్నారు. మంగళవారం ఆలమూరు, ఓడూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనూ పూర్తిస్థాయిలో సదుపాయాలు ఉండాలన్నారు. ఓడూరులో 4500 గోనె సంచులు ఉన్నాయని, ఇంకా 14000 వేల సంచులు అవసరమవుతాయని తెలిపారు. ఆలమూరులో 30 శాతం మాత్రమే సంచులు ఉన్నాయని కొద్దిరోజుల్లోనే పూర్తిస్థాయిలో పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

గంధర్వ మహల్‌ను సందర్శించిన చిత్రకారుడు శక్తిదాస్

ప్రజాశక్తి - ఆచంట

ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య ఏకలవ్య శిష్యుడు వెంకట్రావు (శక్తిదాస్) ఆచంటలోని గంధర్వమహల్‌ను సందర్శించారు. పిల్లలకు, పెద్దలందరికీ విజ్ఞానం, వినోదం అందించి, చందమామ కథలకు తన అమూల్యమైన చిత్రాలను వేసిన శక్తిదాస్ తన కుటుంబసభ్యులతో కలిసి ఆచంట వచ్చారు. ఈ సందర్భంగా ఆచంటలోని పేరొందిన గంధర్వమహల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య ఒక సృష్టికర్త అని, ఆయన వేసిన చిత్రాలు అద్భుతంగా ఉండేవని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చిన్నతనం నుండి ఆయనకు ఏకలవ్య శిష్యునిగా ఉంటూ లక్షలాది చిత్రాలు వేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తమిళం, తెలుగులో వివిధ దినపత్రికలు, వార పత్రికలు, మాసపత్రికలకు చిత్రాలు వేయడం జరిగిందన్నారు. త్వరలో గంధర్వమహల్ వందేళ్ళ పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఒక మంచి చిత్రాన్ని వేయనున్నట్లు శక్తిదాస్ తెలిపారు.

పాఠశాలను పునర్నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - ఉండి

శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలని దళిత నాయకులు మత్తే రాజకుమార్ కోరారు. మంగళవారం కాళ్ల మండలం సీసలి గ్రామానికి వచ్చిన ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాండ్రం గ్రామంలోని ఎస్‌సి పేటలో పాఠశాలను నిర్మించి దాదాపు 50 సంవత్సరాలైందని, ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరి విద్యార్థులు భయంగా విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేదని తెలిపారు. దాని స్థానంలో కొత్త పాఠశాలను నిర్మించాలని కోరారు. దీనిపై విక్టర్ ప్రసాద్ సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఎబిసిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఈనెల 16న ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ వారి హుండీ ఆదాయం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేవారు ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉండాలని సూచించారు.

లయన్స్ మరిన్ని సేవలందించాలి

ప్రజాశక్తి - ఆకివీడు

సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని లయన్స్ క్లబ్ మరిన్ని సేవలందించాలని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ కె.పంకజక్షన్ అన్నారు. మంగళవారం పట్టణ, మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొని మాట్లాడారు. ముందుగా పట్టణంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదర్శ లయన్స్ క్లబ్ నిర్వహించిన మధుమేహ పరీక్ష కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సిద్ధాపురంలో జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ కార్యదర్శి డాక్టర్ ఎంవి. సూర్యనారాయణరాజు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, ఢిల్లీ సతీష్ కుమార్, కోశాధికారి నేరెళ్ల విజయ్ పాల్గొన్నారు.

తగ్గుతున్న నైతిక విలువలు

మానవత రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధాపుష్పవతి

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రస్తుత సమాజంలో విలువలు తగ్గిపోతున్నాయని జిల్లా కెరియర్ గైడెన్స్ కమిటీ ఛైర్మన్, మానవత రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధాపుష్పవతి అన్నారు. మానవత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కెరియర్ గైడెన్స్ ఆధ్వర్యంలో ఎస్‌కెఎస్‌డి జూనియర్ కళాశాలలో విద్యార్థినుల నైతిక విలువలు అనే అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాధాపుష్పవతి మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు మంచి, చెడు విలువలను బోధించేవారన్నారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ ఛైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ మనం వేసే ప్రతి అడుగును గమనించుకోవాలన్నారు. తణుకు మండల ఛైర్మన్ బోయపాటి రామలక్ష్మి మాట్లాడారు. అనంతరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కె.నీరజాసాయి, టి.వినయదుర్గ, పెయింటింగ్‌లో విజేతలకు కళాశాల కరెస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హైదరాబాద్ రోటరీ క్లబ్ వారు బహూకరించిన డిక్షనరీలను కాలేజ్ టాపర్స్ 35 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి సుబ్బారావు, కె వాణి, ఎం.రత్నకుమారి, భద్రం, రమణమూర్తి, భాస్కరరావు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆభరణాల చోరీ

నేరాలు - ఘోరాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలిపై దాడి చేసి బంగారు ఆభరణాలు అపహరణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరుపాలెం సౌత్ ఓసురివారి మెరకకు చెందిన మేడిద కృష్ణవేణి (90) సోమవారం రాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమెపై దాడి చేసి తల, ముఖంపై బలంగా కొట్టారు. ఆమె చేతికున్న ఐదు కాసుల బంగారు గాజులు, మెడలోని కాసు నల్లపూసల తాడు అపహరించారు. స్థానికులు అత్యవసర వాహన సిబ్బందికి సమాచారం అందించగా ఆమెను ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యం కోసం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంగళవారం ఎస్‌పి యు.రవి ప్రకాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిఐ వాడపల్లి సురేష్ బాబు ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్ సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలు కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి


కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన ఉండి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక దివ్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న పొట్టూరి వీర వెంకట నాగ ప్రవళ్లిక సోమవారం కళాశాలకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరింది. అయితే ప్రవళ్లిక చెల్లెలు భోజనం క్యారియర్ కళాశాలకు తీసుకెళ్లగా ప్రిన్సిపల్ ఆమె కాలేజీకి రాలేదని చెప్పారు. దీంతో చుట్టుపక్కల వెతికిన తండ్రి వీరబాబు ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వారికి పెట్టే భోజనంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం ఉండిలో పర్యటించిన ఆయన పలు అంగన్వాడీ కేంద్రాలను, రేషన్ షాపులను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరును పరిశీలించి విద్యార్థులకు పెట్టే ఆహారాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద ప్రవేశ పెట్టిందన్నారు. సుమారు 700 మంది విద్యార్థులున్న ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేవలం 280 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలలో ఇచ్చే ఆహారాన్ని తీసుకుంటున్నారని మిగిలిన వారు ఇళ్ల దగ్గర నుండి తెచ్చుకుంటున్నారని, మిగిలిన వారు కూడా జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భోజనం చేసేలా విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తెలిపారు. మే నుంచి ఇప్పటివరకు 22 జిల్లాల్లో 465 కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. బుధవారం భీమవరంలో జెసితో జరిగే సమీక్ష సమావేశంలో ఇప్పటివరకు జిల్లాకు సంబంధించి అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, ఐసిడిఎస్ పీడీ సుజాత రాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ, సివిల్ సప్లై డిఎం.శివరాం ప్రసాద్, సివిల్ సప్లై జిల్లా అధికారి ఎన్.సరోజ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డి

భీమవరం రూరల్ : మండలంలో స్టేట్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి, కమిషన్ సభ్యులు కిరణ్‌తో కలిసి మంగళవారం పలు పాఠశాలలను సందర్శించి నేషనల్ ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం భోజనాలు పెడుతున్నారో లేదో పరిశీలించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని, శానిటేషన్ పరిస్థితులను, భోజనం వండే తీరును తనిఖీ చేశారు. ఉండి హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, భీమవరం పట్టణంలో ఝాన్సీ లక్ష్మీబాయి బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్దపై అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అందరికీ రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. అనంతరం భీమవరంలో ఝాన్సీ లక్ష్మీబాయి బాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట డిఇఒ ఆర్‌వి.రమణ, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఎం సివిల్ సప్లయ్ టి.శివరామ ప్రసాద్, ఐసిడిఎస్ పీడీ సుజాతారాణి ఉన్నారు.

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాం : ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - వీరవాసరం

నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్‌ఎ బాలేపల్లి గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వారికి వివరించారు. అలాగే గ్రామస్తులు సమస్యలు పరిష్కరించాలని కోరడంతో చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ అధికారులను ఆదేశించారు. తన పొలానికి ఆనుకుని ఉన్న రొయ్యల చెరువు వల్ల తీవ్రంగా నష్టపోతున్నానంటూ రైతు దూసనపూడి సోమన్న ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురావడంతో ఎంఎల్‌ఎ సానుకూలంగా స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు తవ్వితే చర్యలు తీసుకోలని రెవెన్యూ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందక పోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, చికిలే మంగతాయారు, వైసిపి మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. మంగళవారం ఆయన దేవ గ్రామ సచివాలయ వాలంటీర్లతో సమస్యలపై సమీక్షించారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు దేవ లో రూ.24.4 లక్షలతో ఎంపిపి స్కూల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పోతినీడి వెంకటేశ్వరరావు, సర్పంచి నల్లూరి సత్యనారాయణ, సాక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బిజెపిని ఓడించడమే లక్ష్యం : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మతతత్వ భావజాలం కలిగిన బిజెపిని దేశవ్యాప్తంగా ఒంటరిని చేసి, ఓడించడమే సిపిఎం లక్ష్యమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జెన్‌వి గోపాలన తెలిపారు. సిపిఎం రాజకీయ శిక్షణా తరగతులు రెండో రోజు మంగళవారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడారు. సిపిఎం తక్షణ కర్తవ్యాలను పార్టీ సభ్యులందరూ నెరవేర్చాలన్నారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల రూపాయల రాయితీలిచ్చి ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారని తెలిపారు. అంబానీ, ఆదానీలకు రూ.11 లక్షల కోట్ల రాయితీలిచ్చి పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారన్నారు. సిపిఎం అంటే ప్రజల తరపున నిలబడే శక్తిగా అందరికీ గౌరవం, నమ్మకం ఉందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నడుస్తున్న ఏకైక పార్టీ సిపిఎం అన్నారు. శిక్షణా తరగతుల్లో జి.నాగేశ్వరరావు, ఎం.రాజు, జె.శ్రీను, ఎస్.శేషుబాబు, కె.వెంకటేశ్వరరావు, పి.శ్రీను, వి.అప్పారావు, ఎం.రాజు, సిహెచ్.రాము, పి.నాగేంద్రబాబు, ఆర్.నాగేంద్ర పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం గ్రంథాలయం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

విద్యార్థులు పుస్తక పఠనం అలవార్చుకోవాలని కళశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ రావు తెలిపారు. వైఎస్ కళాశాల (అటానమస్) గ్రంథాలయ విభాగం వారు గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల గ్రంథాలయ అధికారి జి.కోటయ్య అతిథులను సభ వేదిక వద్దకు ఆహ్వానించారు. అనంతరం కళశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, భారత గ్రంథాలయ పితామహులు ఎస్ఆర్ రంగనాధన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడారు. గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎపి అప్పారావు, ముఖ్యఅతిథి రాజేంద్ర ప్రసాద్ పుస్తక పఠనం చేసి ఉన్నత విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

ఉండి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఉండి మండల పరిషత్ విస్తరణాధికారి అందే కొండలరావు అన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉండి శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందే కొండలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. గ్రంథాలయ అధికారి జక్కంపూడి కృష్ణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో పుస్తకాలు పిలుస్తున్నాయి కార్యక్రమం నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పుస్తకపఠనం చేయించి, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. బుధవారం జరిగే వకృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్తి.వీరా స్వామి, జెవి.నాయకులు, నున్నాసత్యం పాల్గొన్నారు.

పోడూరు : జిన్నూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, పుస్తక ప్రదర్శన, అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు జామాను రామ లక్ష్మణరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నాగ శివరాం, ఎస్.ప్రియాంక, బి. లక్ష్మి పాల్గొన్నారు.

గొప్ప నటుడు కృష్ణ : డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఘట్టమనేని కృష్ణ గొప్ప నటుడే కాదని, ఉన్నత వ్యక్తిత్వం, విలువలు కలిగిన వ్యక్తి అని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా ఆయనకున్న గుర్తింపు సినిమాలకే పరిమితం కాదని, నిజ జీవితంలో కూడా ఆయన అలాగే ఉండేవారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాకు ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. ఆయన రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించకపోయినా వైఎస్ఆర్‌కు, రాజీవ్‌గాంధీకి ఆయన ఎంతో సన్నిహితులుగా ఉండేవారని తెలిపారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొలిశెట్టి శ్రీనివాస్ కృష్ణ చితపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణ మృతి పట్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ, గొర్రెల శ్రీధర్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, నాయకులు సంతాపం తెలిపారు.



ఆచంట : కృషి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

భీమవరం : తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్న కృష్ణ మతి బాధాకరమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీగా పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి కృష్ణ కృషి చేశారని తెలిపారు. అనంతరం ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఆచంట: సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ అకాల మృతి అభిమానులకు తీరనిలోటని ఆచంట కృష్ణ ఫ్రాన్స్ అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ (ఆర్‌టిసి) అన్నారు. మంగళవారం కృష్ణ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన అకాల మరణం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేద వ్యక్తం చేశారు. ఆయన మృతికి కృష్ణ ఫ్రాన్స్ సభ్యులు కారుమిల్లి ప్రసాద్, మనువర్తి సుధాకర్, బొట్ల చక్రి, పీతల రాజు, పడమటి సుబ్రహ్మణ్యం, కలగట సాగర్, నిమ్మన కుమార్ సంతాపం తెలిపారు.

పాలకొల్లు : తిరుగులేని ప్రజాదరణ పొందిన మహానటుడు కృష్ణ అని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. పాలకొల్లు కృష్ణ ఫాన్స్ గాంధీబొమ్మల సెంటర్లో ఏర్పాటు చేసిన సంతాప సభలో కృష్ణ చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. ఆయన మృతి తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ పట్టణ ఫాన్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పినిశెట్టి బుజ్జి, మానాపురం సత్యనారాయణ, టి.భుజంగారావు పాల్గొన్నారు.

పట్టణంలో దర్శకుడు కోడి రామకృష్ణ వ్యవస్థాపక లలిత కళాంజలి నాటక పరిషత్ 1998 మే 24న సూపర్ స్టార్ కృష్ణ, విజయనిర్మల దంపతులను ఘనంగా సత్కరించింది. ఆయన ఆకస్మిక మరణంతో పాలకొల్లు కళా పరిషత్, నటీనట సమాఖ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. సీనియర్ కళాకారులు విన్నకోట వెంకటేశ్వరరావు, వీరా సత్యం, వంగా నర్సింహారావు, మానాపురం సత్యనారాయణ సంతాపం తెలిపారు.

ఉండి : సూపర్ స్టార్ కృష్ణ మృతి బాధాకరమని సెన్సార్ బోర్డు మాజీ సభ్యులు దేవరకొండ వెంకట బాలసుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉపాధ్యాయులు రంగరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కృష్ణ మృతికి సంతాపం తెలిపారు.

నేత్ర సమస్యలపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

నేత్ర సంబంధిత సమస్యల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని పెన్నాడ బైట్ కళాశాల ప్రిన్సిపల్ కొప్పర్తి సురేష్ సూచించారు. కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించినట్లు కళాశాల డీన్ భాస్కర్ రావు తెలిపారు. ఈ శిబిరం మూడు రోజులపాటు పెన్నాడ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు అందిస్తున్న సేవలను గ్రామస్తులు అభినందించారు.

పట్టణ సుందరీకరణకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు పట్టణాన్ని సుందరీకరించాలనే లక్ష్యంతో ఉన్నానని, అందుకు లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖులు సహకరించాలని సిఐ కె.గీతారామకృష్ణ కోరారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సుమారు దశాబ్ద కాలం క్రితం గుండ్ల నరసింహారావు నిర్మించిన గడియార స్తంభంలో గడియారం పాట ఇవ్వడంతో నిర్వీర్యంగా ఉండిపోయింది. ప్రస్తుతం ఆ స్తంభానికి తిరిగి మరమ్మతులు చేసి, ఏర్పాటు చేశారు లయన్స్ క్లబ్ కార్యవర్గం. ఈ గడియార స్తంభాన్ని లయన్స్ జిల్లా గవర్నర్ వికె పంకజక్షన్, సిఐ గీతా రామకృష్ణ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. సేవ కార్యక్రమాల పట్ల తనకు మక్కువ ఎక్కువ అన్నారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ ఎంవిఎస్.రాజు, ఆర్.సూర్యనారాయణ రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీకృష్ణ కార్యదర్శి నెల్లి సతీష్ కుమార్, కోశాధికారి నేరెళ్ల విజయ్ పాల్గొన్నారు.